# 8. దేశోద్ధారకుడు

అర్ధరాత్రి నిద్రకళ్లతో నాయకులందరూ గుమిగూడారు. ఏం ప్రమాదం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. తెలుసుకోవాలనే కుతూహలం వారిని దహించివేస్తోంది.

"మిత్రులారా!" అన్నాడు నాయకుల్లో పెద్ద, ఉపన్యాస ధోరణిలో. నిద్రమత్తు వొదిలించుకొని అందరూ చెవులు నిక్క పొడుచుకొని వింటున్నారు. "ప్రభుత్వం మన పార్టీని బహిష్కరించింది. మరో 3, 4 గంటలలో మనం చాలామంది అరెస్టు కాబోతున్నాం. జైళ్ళల్లో కూర్చొని మనం పార్టీ ప్రణాళికల్ని అనుసరించలేము. కనుక అజ్ఞాతవాసంలో దేశసేవ చేయటం ఒక్కటే మిగిలి వుంది."

ఎవరూ అడ్డుతగలలేదు. అంతా ఏకాభిప్రాయంతోనే వున్నారు. అప్పుడే అజ్ఞాత వాసదీక్షను గూర్చిన ఆలోచనలు వారి బుర్రలలో తీవ్రంగా పనిచేయసాగినవి.

"ఎక్కువ వ్యవధిలేదు. అజ్ఞాతవాసం ఎలా గడపాలో మీలో ఎవ్వరికి చెప్పనక్కర్లేదు. కేంద్ర కార్యాలయంతోనే మీ ప్రతి ఒక్కరికీ సంబంధం. అదంతా అతిరహస్యం. ఇక విడిపోండి."

ఐదు నిమిషాలలో ఎవరెటుపొయ్యారో ఎవరికీ తెలియదు. సీను మాత్రం ఆలోచిస్తూనే నడక సాగించాడు. అతని బుర్ర తీవ్రంగా పనిసాగిస్తూంది. బంధుమిత్రులకు వీడ్కోలు చెప్పే వ్యవధి కూడా లేదు. ఐనా దేశమే తనకు బంధుమిత్రులయ్యాక ప్రత్యేకించి కొంతమందే తనకు ఆప్తు లనుకోవటం సంకుచిత భావమే అవుతుందా!

యీ ఎనిమిదేళ్లలోనూ బాగా పరిచయమై, తనకు నచ్చిన వ్యక్తుల్ని ఒక్కొక్కరుగా జ్ఞాపకం చేసుకున్నాడు. పార్టీ మీద చాలా గౌరవం ఉండాలి. నాయకులంటే చేయలేనిదంటూ ఉండకుండా ఉండాలి. బైటి ప్రపంచంలో మాత్రం పార్టీకి సంబంధించిన వ్యక్తిగా కనిపించరాదు. అన్నిటినీ మించి ప్రాణాన్ని వొడ్డయినాసరే

తనను కడుపులో పెట్టుకొని కాపాడాలి. అలాంటి వ్యక్తి యీ దేశంలో ఒక్కడుంటే తనకు చాలు!

ఎటుపోతున్నాడో తెలియకుండానే అడ్డదార్లలో కాళ్ళు తీసుకొనిపోతూన్నట్లుగా వెళ్తున్నాడు. పిండారబోసినట్లు వెన్నెల దారి కనిపిస్తూన్నా అతనికి అంతా చీకటిమయంగానే వుంది.

బహుశా నాలుగైదు మైళ్ళన్నా నడిచి వుంటాడు. కాళ్ళు నొప్పిపుట్టి మర్రిచెట్టు మొదట్లో, చీకట్లో కూలబడ్డాడు. సిగరెట్టు వెలిగించి బుర్రను మరింతగా రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాడు.

అరగంట గడిచాక కాని సీను ఆలోచనలు తెగలేదు. ఇంకా ఎనిమిది మైళ్ళ దూరంలో ఒక గ్రామం వుంది. అక్కడ రంగయ్య అనే రైతు తనను బాగా ఎరుగును. ఏ పార్టీకి సంబంధించకుండా అంటీ అంటనట్లుగా ఉంటాడు. కాని తన పార్టీ అంటే ఎంతో అభిమానం. తనంటే మరీను! అతని ఇల్లు పెద్దలోగిలి. ఏమూల పడివున్నా సరిపోతుంది. ఉన్నవాడు కావటం, లౌకికం బాగా నేర్చినవాడవం వల్ల అతన్ని ఎవరూ అనుమానించరు. అక్కడ తలదాచుకోవటం శ్రేయస్కరం.

ఐతే రంగయ్య తనను దాచేందుకు ఒప్పుకుంటాడో లేదో? యీ అనుమానం సీనును నిరుత్సాహ పరచలేదు. ఏది ఏమైనా ఆలోచిస్తూ కూర్చునే సావకాశం లేదు. ఫలితం ఎలా వున్నా ఇంతకన్నా మంచిస్థలం దొరకదు.

కొత్త వుత్సాహంతో సీను చకచకా నడవసాగాడు. తెల్లారేలోగా తాను మాయమైపోవాలనే తొందర అతనికి ఎంతో ఆతృతను కలిగించింది. దేశంకోసం తానుచేసిన, చేయబోతున్న త్యాగం అతనికి కొత్త శక్తిని ప్రసాదించింది.

## 2

సీను దారిలో నక్కను తొక్కి వుంటాడు. అందుకనే రంగయ్య అతగాడి అజ్ఞాతవాసానికి తగిన ఏర్పాట్లన్నీ చేశాడు.

సామానులు ఉండే గదిలో అంతాసర్దాడు. కొంచెం గాలి, వెలుతురూ వచ్చేందుకు పైనవున్న చిన్నకిటికీని తెరిచాడు. యీగది చివర్న వుండటం వల్ల ఎవరూ అటురారు. ఒకవేళ ఎవరైనా వస్తే దొడ్డిదోవ పక్కనే వుంది. గోడ దూకితే అంతా బయలు. ఆ చెట్టుచాటునుంచి ఎలాగో మాయం కావచ్చు. ఊరికి చివరి ఇల్లు కావటంవల్ల జనాభా రావటం పోవటం ఉండదు. ప్రశాంతంగా కాలం గడిచిపోవచ్చు.

సూర్యోదయానికి గంటకు పూర్వమే ఈ ఏర్పాటులన్నీ పూర్తయినవి. రాత్రంతా శ్రమపడి ఉండటం వల్ల సీనుకు నిద్రపట్టింది. ఇతర భయాలూ ఆదుర్దాలూ లేనందువల్లనే నిద్రాదేవి అతన్ని పూర్తిగా ఆవహించింది.

సీనుకు మెలకువ వచ్చేటప్పటికి సూర్యుడు నడినెత్తిన వున్నాడు. పై కిటికీలోనుంచి తీవ్రమైన సూర్యునికిరణాలు అతని కాళ్ళ మీద పడుతున్నవి. లేచి కూర్చునేటప్పటికి ప్రక్కనే పడివున్న దినపత్రిక కనిపించింది. ఆతృతతో పత్రిక పేజీలు తిరగేశాడు. పార్టీని గూర్చికానీ, రాజకీయకల్లోలాలను గూర్చికానీ ఏమీలేదు. నిట్టూర్చి పత్రికను గది మూలలోకి విసిరికొట్టాడు.

సీనుకు ఆకలి దహించి వేస్తూంది. ఎవర్ని అడగాలో, ఎట్లా అడగాలో తెలియటంలేదు. యీ ఇంట్లో – కాదు – యీ ప్రపంచమంటేనే తనకు ప్రస్తుతానికి యీగదే! ఏది కావాలన్నా ఇక్కడికి రావాల్సిందేకాని, తను ఎటూ కదిలేందుకు వీల్లేదు.

ఈ రంగయ్య, బైటకి వెళ్ళేవాడు తనకు కావలసినవన్నీ సమకూర్చి మరీ పోకూడదా? ఏమిటో – మనుషులు ఇతరుల అవసరాల్ని గుర్తించి నట్లయితే జీవితం ఇంత బాధగా ఎందుకుంటుంది?

అశాంతితో సీను గదిలో కాలు కాలిన పిల్లివలె తిరుగుతున్నాడు. ఏ విషయాన్ని గూర్చీ ప్రత్యేకంగా అతను ఆలోచించటం లేదు. జీవితం ఒక్కసారిగా తారుమారయ్యేటప్పటికి దిమ్మెరపోయినట్లయింది.

తలుపు తెరుచుకున్న శబ్దం అతన్ని అదరకొట్టింది. ఏం చెయ్యాలో తేల్చుకోకముందే ఒక యువతి ప్రవేశించింది. ముఖకళను బట్టి ఆమె తన శత్రుకోటిలోది కాదని గ్రహించగలిగాడు.

"నాన్నగారు బైటకి వెళ్లారు. మీరు ఇటువొచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటే భోజనం తెస్తాను" అందామె.

ఇంతకు పూర్వం రంగయ్యను నిందించటం పొరపాటనుకున్నాడు. నిజానికి ప్రస్తుతం తనకు రంగయ్య కన్న ఆప్తులు ఎవ రున్నారు కనుక? తనకు హృదయపూర్వకంగా సానుభూతి చూపే రంగయ్య నిజంగానే దేవత్వమున్న మానవుడిగా తోచాడు.

మాట్లాడకుండా సీను ఆమెను అనుసరించాడు. ఆమె గడ్డివామి పక్కగా నడిపించింది. చాలా త్వరగానే కాలకృత్యాలు తీర్చుకొని తన బోనులోకి జొరబడ్డాడు. అక్కడ భోజనం సిద్ధంగా వుంది. రుచి నెరుగని ఆకలితో ఆవురావురు మంటూ భోజనం ముగించాడు. తను భోజనం చేస్తూన్నంతసేపూ ఆమె చాలా ఆతృతగా, తనకు ఏం అవసరమౌతుందో నన్నట్లు వేచి వుంది. కాని అతనేమీ అడగలేదు... అడగదలుచుకోలేదు.

మొదటినుంచీ సీనుకు ఆడవాళ్లంటేనే మంట! వాళ్ళు మగవాళ్ళను ఆకర్షిస్తారనీ, మొగవాళ్ళు ఆ టక్కులకు లొంగిపోయి నీచాతి నీచంగా ప్రవర్తిస్తారనీ, అందుకని ఆడవాళ్లకు దూరంగా ఉండటంలోనే సుఖం వున్నదనీ అతని నమ్మకం. అసలు

ఆడవాళ్లే లేకుంటే యీ ప్రపంచం ఎంతో హాయిగా వుండేదని ఒకప్పుడు నమ్మాడు; కాని ఆ స్త్రీలే లేకుంటే తనూ, తనలాటి ఇతర పురుషులు ఎలా జన్మించి ఉండేవారో అర్థంకాక, స్త్రీలు ఉండరాదనే నమ్మకాన్ని మార్చుకున్నాడు.

యీ అమ్మాయిని చూసిన మొట్టమొదటి క్షణంనుంచీ - పొరపాటు - సీను అసలామెను చూడలేదు. అతను ఏ ఆడదాన్నీ పరీక్షగా చూడడు; ఇంకాస్సేపటికి యీమె వొస్తే తను గుర్తుపట్టలేడు కూడాను! ఆమె గదిలో ప్రవేశించినప్పటినుంచీ, తనను కాపాడే ఆ ప్రదేశం నరక సమానంగానే తోచింది. ఆమె కదుల్లాడుతే, తన సర్వస్వాన్నీ వొడ్డిన జూదరివలె భయపడుతున్నాడు. తను చాలా ఇబ్బందిగా - గట్టిగా వూపిరి పీలుస్తే పెద్ద ప్రమాదం సంభవిస్తుందేమోనన్న భీతితో వేగిపోయాడు.

భోజనం కాగానే ఆమె ఎంగిలాకు తీసేసింది. ఆమె వెళ్ళిపోయింది. కాని తన మీదవున్న హిమాలయం తొలగలేదు. ఇక ఇలా కుదరదు. రంగయ్యతో చెప్పి వేరొకర్ని నియమించుకోవాల్సిందే! యీ ఆడకత్తెరలో పడి తన్నుకోవటం, అన్నిటినీ మించి భయంతో ఒణకటం - యీ బాధలు తను పడలేడు.

వొదిలిపోయిందికదా అనుకుంటే పది నిమిషాల్లో ఆమె తిరిగివొచ్చింది. చిటచిట్లాడే మొహం పెట్టి ఆమె ఎందుకొచ్చిందో కనుక్కునే ప్రయత్నంలో వున్నాడు సీను. యీ అవస్థనుంచి ఆమె అతన్ని బైటపడేసింది.

చేతుల్లో వున్న పుస్తకాలు కింద పెడుతూ "ఇవేమన్నా మీ కాలక్షేపానికి పనికొస్తాయేమో చూడండి" అందామె.

సీను ఆముదపు మొహం పెట్టి తలతిప్పాడు. ఆమె మరేమీ మాట్లాడకుండానే వెళ్ళిపోయింది. ఆమె తన మేలు కోరుతున్నప్పటికీ తన కీడు కోరే వాళ్ళలోనే జమగా తోస్తుంది. ఎంత సర్ది చెప్పుకోవాలని చూచినా అతని మనస్సు ఏవిధంగానూ ఒప్పుకోవటం లేదు.

ఆ పుస్తకాలన్నీ తిరగేశాడు. చాలావరకు కథలు. 'వెధవకథలు' మూలకు నెట్టాడు. ఏ రెండు మూడు పుస్తకాలో పార్టీ రాజకీయాలకు సంబంధించినవి ఉన్నవి. వాటిల్లో కొన్ని భాగాలు ఇదివరకే తను చదివాడు. చదవనివి చదివినట్లుగానే ఉపన్యాసాలు దంచేవాడు. వినేవాళ్ళు అసలేదీ చదవలేదు కనుక అంతే కాబోలనుకునేవాళ్ళు.... ఇంతమందికి నాయకుడల్లే నటించగలిగిన శక్తి సామర్థ్యాలమీద అతనికి గౌరవం ఏర్పడింది. ఐనా ఇప్పుడు ఆ కొత్త భాగాన్ని తిరగేసి చూస్తే ప్రమాదమేముంది? తన అభిప్రాయాలతో అవి ఏకీభవిస్తే తను కూడా ఆ రచయితంత గొప్పవాడు. ఏకీభవించకుంటే తను మారేది లేదు. కనుక తన ఆశయాలకు భంగం రాదు.

ఏదో అసంతృప్తితోనే చదవసాగాడు. చదివేది సరిగ్గా బుర్రకు ఎక్కటంలేదు. అతని ఆలోచనలన్నీ రాజకీయ పరిణామాలమీదా, విప్లవం మీదా పనిచేస్తున్నవి.

ఇంతలో రంగయ్య వచ్చాడు. ఆ మాటా యీ మాటా మాట్లాడాడు. తన ఇంటిని ఎవరూ అనుమానించరనీ, సీనుకు ఇంతకన్నా మంచిస్థలం మరిదొరకదనీ, యీ విధంగా నన్నా తను దేశభక్తులకు సేవ చేయగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాననీ – ఇంకా ఇలాటి అభిప్రాయాలనే వెలిబుచ్చాడు. వీటన్నిటితోనూ ఏకీభవించేందుకు సీనుకు ఎలాటి అభ్యంతరమూ లేదు.

"మీకిక్కడ సుఖంగానే గడుస్తుంది. నేను వున్నా లేకున్నా గంటగంటకూ అమ్మాయి మీ క్షేమం విచారిస్తూనే వుంటుంది" అన్నాడు రంగయ్య. యీ 'అమ్మాయి' విషయంలోనే తను ఏకీభవించంది!

"ఇంకెవ్వరూ లేరా?" అన్నాడు సీను.

"ఎవర్ని నమ్మమంటారు? యీ జీతగాళ్ళకు తెలుస్తే మీ మెడకూ, నా మెడకూ కూడా ఉరితాడే కదా! ఐనా పద్మ కూడా చదువుకుంది. రాజకీయాలంటే చెవికోసుకుంటుంది. అది అడిగే ప్రశ్నలకు జవాబులైతే నాకు తెలియవు కాని మీలాటి వారి ద్వారా దాని అనుమానాలన్నీ తీరుతవి ... మీకది ఇబ్బంది కలిగించలేదుకదా!"

"ఎబ్బే ఏం లేదు" అని చప్పరించాడు సీను.

"సరే నేవొస్తా" అని రంగయ్య వెళ్లిపోయాడు.

పద్మ! తనపాలిటి రాక్షసల్లే కనుపిస్తోందే కానీ తన క్షేమాన్ని కోరే దానిలాగు లేదు. ఇదొక్కటే తనకు బాధాకరమైన విషయం... యీమెను వొదిలించుకునే మార్గమేమీ కనిపించటంలేదు.

పోనీ తనే వదిలిపోతే బాగుండునేమో? అంటే మరో ప్రదేశాన్ని ఖాయపరచుకొని తిరిగి దేశం మీద పడాలి. ఇప్పటికే పోలీసులు తన కోసమూ తనలాటి ఇతర నాయకుల కోసమూ గాలిస్తూండి వుంటారు.

ప్రమాదమని తెలిసివుండీ, ప్రమాదంలో ఇరుక్కోవటం మాత్రమే అవుతుంది. అదీగాక ఇంతకన్న మంచిచోటు దొరకందే, దీన్ని ఒదులుకోవటంలో అర్థం లేదు.

ప్రస్తుతానికి యీ పద్మను భరించక తప్పదు. ఆమె నమ్మదగ్గదనీ, పార్టీ అంటే అభిమానంగలదనీ, రంగయ్యే చెప్పాడు. అంతవరకూ బాగానే వుంది... కాని ఆమె స్త్రీ! అది పెద్ద బాధ! తనను ఎక్కడ పతనం చేస్తుందో నని భయం! ఐతే తను పతనమయ్యేందుకు సిద్ధం కానంతవరకు, ఏమరుపాటు పడనంతవరకూ తనను ఎవరు మాత్రం ఏం చేయగలుగుతారు?

యీ వూహను సీను పెంచుకున్నాడు. నిజమే! ఒకళ్ళు యింకోళ్లను చేసేదేమిటి? మొదటినుంచీ పట్టుదలకూ, నిశ్చితాభిప్రాయాలకూ తనకు పెట్టింది పేరు...చదువువల్ల లాభంలేదని బి.ఎ. చదువుతూ చదువుతూ మానేశాడు. ఎంతమంది తనను బతిమాలి

భంగపడినప్పటికీ చదువుజోలికి పోలేదు. యీ బంధువు లందరూ తన వాళ్ళు కాదనుకున్నాడు - అంతే - వాళ్ళెన్నటికీ తన వాళ్ళు కాలేరు. రాజకీయ విప్లవానికి కంకణం కట్టుకున్నాడు; దానికోసమై నిద్రాహారాలు మాని తలకుమించిన శక్తితో అహోరాత్రాలూ పోట్లాడుతూనే వున్నాడు. ఎప్పుడూ, ఎన్నడూ దిగజారటంకానీ, వెనుకడుగు వేయటంకానీ లేదు. ఎన్ని కష్టాలు వొచ్చినా ఎన్ని బాధల్ని ఎదుర్కోవాల్సి వొచ్చినా మొక్కవోని ధైర్యసాహసాలతో, గుండెబలంతో ముందుకుపోతూనే వున్నాడు... యీ తత్వమున్న తనను పద్మే కాదు - దేవలోకంలోని దేవకన్యలందరూ కలిసినా ఏమీ చేయలేరు.

ఐతే తనకు స్త్రీ జాతంటేనే ద్వేషమైనప్పుడు వాళ్ళు తనకు దగ్గరయేందుకు, తన హృదయంలోని జ్వాలకు భయపడటం తథ్యం! పోతే వాళ్ళంటే తను భయపడటమంటే తనపట్టుదలను శంకించటమే అవుతుంది. కనుక పద్మ వచ్చినప్పుడు ఆమెను 'అతను' గానే చూడటం అలవాటు చేసుకుంటే మరి బాధవుండదు. ఇంతకన్న మంచిపద్ధతి లేదు. ఒకరకంగా ఇది తన పట్టుదలకు అగ్నిపరీక్ష లాటిది. క్షణక్షణమూ అంతరాత్మ పరాకు చెపుతూనే వుంటుంది కనుక తను దూరంనుంచే తన ఆశయాన్ని నిలబెట్టుకోగలడు. యీ నిశ్చయంతో సీను హృదయం ఉక్కులాగు తయారై పోయినట్లయింది.

## 3

రోజులు గడుస్తూన్నవి. నాయకుల్ని పట్టుకునేందుకు ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తూనేవుంది. ఇద్దరు ముగ్గురు మాత్రం పట్టుబడ్డారు. వాళ్ళగతి ఏమైందో తెలియదు.

తనుకూడా పట్టుబడతాననే అనుమానం సీనుకు ఎన్నడూ కలగలేదు. యీగది మొదట్లో జైలువలె ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడు ప్రపంచంలో ఒక భాగంవలెనే వుంది. మనుష్యుల్ని కలుసుకొనిమాట్లాడే సావకాశం లేనప్పటికీ, పార్టీ రాజకీయాలు ఎలా కొనసాగుతూన్నవో, నాయకులు ప్రజల్లో ఎలాంటి పరిణామాల్ని తేగలుగుతున్నారో చూస్తూంటే, తను, తనలాటి అనేకులు పడ్డ శ్రమంతా వృథా కాలేదనిపిస్తోంది. చేతులూ, కాళ్ళూ కట్టివేసినప్పటికీ, నోళ్లు నొక్కి వేసినప్పటికీ నాయకుల హృదయాలూ, ఆత్మలూ ప్రజల్లో జొరబడగలుగుతూనే ఉన్నవి. సీను జీవితాన్నే జయించినట్లు జీవితాశయాలే నెరవేరినంత ఆనందంతో హాయిగా వున్నాడు. తను కూడా ప్రజల్లో సంచలనం కలిగించేందుకు ప్రయత్నిస్తూనే వున్నాడు.

ప్రతి రోజూ చాలాసేపు ఆలోచించటం, ఏదేదో రాయటం, రాసింది ఎలాగో దేశంమీదికి విసిరివేయటం చేస్తూనే వున్నాడు. ఐతే ఇందుకు ఒక పక్క రంగయ్యా, వేరొకపక్క పద్మ తనకు రెక్కలవలె ఉండి, చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

పూర్వంవలె పద్మ అంటే సీను మండిపడటం లేదు. పైపెచ్చు రోజు రోజుకూ ఆమె తనకు దగ్గరవుతూన్నట్లే వుంది. ఐతే ఆమెను 'అతను' గానే పరిగణించటం వల్ల ఆమె అంటే భయమే లేదు. ఒక స్నేహితుణ్ణి చూసినట్లు చూడటానికి అలవడిపొయ్యాడు.

ఎంతసేపని ఒంటరిగా తనలో తాను ఆలోచించుకుంటూ మధనపడగలడు? తనతో మాట్లాడేది ఇద్దరే వ్యక్తులు. వారిద్దర్లో రంగయ్యతో రాత్రి తప్ప మాట్లాడటం పడదు. పోతే పద్మ మాత్రం తనతో మాట్లాడటంలో కుతూహలాన్ని చూపుతూంది. ఆమె తన అనుమానాల్ని చెప్పటం, తను వాటన్నిటినీ తీర్చటం. ఇందువల్ల తనకూ కాలం గడవటం జరుగుతోంది. యీమెతో కూడా మాట్లాడకుంటే కొన్నాళ్ళకు మాటలే మరచిపోవచ్చు కూడాను!

పద్మ అపాయకరమైన వ్యక్తి కాదని తెలుసుకునేందుకు సీనుకు ఎక్కువ కాలం పట్టలేదు. తన వలెనే ఆమెకు కూడా పరమపవిత్ర భావాలు ఉన్నవి – ఆమె అమాయకంగా అడిగే అవివేక ప్రశ్నలకు మనస్సులో జాలిపడి, ఆమెకు అర్థమయే విధానంలో ప్రశాంతంగా జవాబులు చెప్పేవాడు. ఇలా కొన్నాళ్ళు సాగేటప్పటికి ఆమె తన రాజకీయ విజ్ఞానాన్ని ఎంతగానో పెంచుకుంది. పార్టీ ప్రణాళికల్ని గూర్చి చర్చించగలిగే స్థితికి వచ్చింది. ఇందుకు సీను ఆమెను మెచ్చుకున్నాడు. కాదు, ఇదంతా తన తర్ఫీదే కావటంవల్ల ఒక రకంగా తనను తనే మెచ్చుకున్నాడు! ఒకనాటికి యీమె కూడా దేశనాయికలలో ఒకతె కావచ్చు. ఇలాటివాళ్ళ అవసరం దేశానికి ఎంతైనా ఉంది. అందుకు తను చేసిన యీ ఘనకార్యం ఒకనాటికన్నా దేశాన్ని ఉద్ధరించేందుకు ఉపకరించవచ్చు.

రాత్రిళ్లు రంగయ్యయినా ఎక్కువసేపు మాట్లాడేవాడు కాదు. పొలం పనిలో అలసిపోవటం వల్ల ఏదో చుట్టపుచూపుగా పలకరించి పోతూండేవాడు. ఇక రాత్రి చాలాసేపటి వరకూ సీను అనేక విషయాల మీద తీవ్రంగా ఆలోచిస్తూండేవాడు.

కొన్నాళ్ళుగా అతని మనసులో పద్మ మెదలుతూవుంది. మొదట్లో ఆమెను ఎంత అసహ్యించుకునేవాడో, ఇప్పుడంతగా ఆపేక్ష చూప గల్గుతున్నాడు. ఇలా ఎందుకు మారాడో, ఎలా మారగలిగాడో తనకే తెలియదు. అందులోనూ స్త్రీ జాతికే ఎంతో దూరంలో వుండాలనే సిద్ధాంతాన్ని మనోవాక్కాయ కర్మలా గాఢంగా అమలుజరిపే తను, ఈ ఒక్క స్త్రీకే ఇంత దగ్గరగా జరగటం ఆశ్చర్యమే!

ఇదే విషయాన్ని తరిచితరిచి ఆలోచించేవాడు. ఐతే పవిత్రమైన మనసుతో నిష్కల్మషమైన హృదయంతోనే ఆమెతో మాట్లాడగలడు. నిగ్రహమనేది తనలో కొల్లలుగా వుంది. ఏమైనప్పటికీ ఆమెతో పూసుకొని తిరగటం తనకూ ఆమెకూ కూడా అంత క్షేమకరం కాదనీ, ఆమెకు దూరంగా – అంటీ అంటకుండా వుండటమే ఎంతైనా మంచిదనీ రాత్రిపూట నిర్ధారణగా తేల్చుకుంటాడు. కాని తెల్లారాక ఆమె ప్రత్యక్షమై

సేవకురాలివలె ప్రవర్తించసాగాక, వెంటనే అతని అభిప్రాయం పటాపంచలవుతుంది - ఈమె తననొక దైవస్వరూపునివలెనే చూస్తోందనే భావన ఆమె పట్ల ఒక గొప్ప సానుభూతికి, అభిమానానికి కారణమౌతూంది. ఆ తరువాత ఆమెను నొప్పించటం ఇష్టముండదు. అసలు అదంతా మరిచిపోయి, ఆమెను ఆత్మబంధువు వలెనే చూసేవాడు. ఈ విశాల ప్రపంచంలో ఆత్మబంధువులనే ప్రత్యేక వ్యక్తులేలేని తనకు, ఈమెను ఆత్మబంధువుగా ఒప్పుకోవటం, బహుశా తనను కంటికిరెప్పవలె కాపాడటం వల్లనేకావచ్చు. అంతే; మళ్లీ రాత్రికి జరిగే ఆలోచనలు వేరు; పగటి ప్రవర్తన వేరూనూ.

ఒక రాత్రి తను పెడమార్గాన పడుతూన్నట్లు అనుమానం వేసింది. ఆ అనుమానంతో వెనక్కు తిరిగి చూసుకుంటే తాను దారితప్పి చాలా దూరం వచ్చినట్లే తోచింది. అసలు దారి పోగొట్టుకున్న పాంథుని మనస్తత్వంలోని భయం అతన్ని ఆవహించి, వొణికిపోయ్యాడు.

ఇప్పుడు రాజకీయాలు అతని బుర్రలో పనిచేయటం లేదు. ప్రపంచ సమస్యలు ఒక మూలకు జేరి అన్నిటిస్థానే పద్మ ఒక్కతే గొప్పసమస్యగా తయారయింది. తెలియకుండానే, గ్రహించకుండానే ఆమె తన హృదయాన్ని ఆక్రమించింది. ఇప్పుడు చూస్తే ఆమెను హృదయంలో నుంచి తొలగించడం తనకు సాధ్యమయ్యేదిగా తోచటంలేదు.

పవిత్రమైన ఆశయాలను ప్రకృతిశక్తులు ప్రతిఘటించకుండా వుండవు. ఐనప్పటికీ ఎంతో చదువుకున్న తను, పదిమందికి చెప్పగల తను, సంస్కారమున్న తను ఆ శక్తుల్ని ప్రతిఘటించి జయించ గలుగుతూనే వున్నాడు. ఐతే ఏ కాస్త సమయంలోనో అవి తనను లొంగదీసుకుంటయ్యేమోననే భయం కూడా లేకపోలేదు.

పుట్టినప్పటినుంచీ తను సుఖమంటే ఎరగడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోయారు. బంధువుల పంచల్లో తలదాచుకుంటూ, వారు పెట్టే బాధలన్నిటినీ భరిస్తూ జీవితపు చీకటి దశ మాత్రమే తెలుసుకో గలిగాడు. ఎన్నడూ తన సుఖానికి ప్రయత్నించలేదు. చదువుకునే రోజుల్లో కూడా తన స్వార్థానికి కాకుండా పదిమందీ బాగుపడేందుకు, అందరూ సౌఖ్యపడేందుకు నాయకత్వం వహించి సమ్మెలు జరిపించాడు. 'నీ' 'నా' అనే భేదంతో హృదయాన్ని ఎన్నడూ సంకుచిత పరచుకోలేదు.

ఇద్దరు ముగ్గురు బంధువుల ఇళ్లల్లోని స్త్రీలు తనను వలలో వేసుకోవాలని ప్రయత్నించారు. వ్యక్తులు ఇంత నీచంగా ప్రవర్తిస్తారని అతనెన్నడూ అనుకోలేదు. అంతే; అప్పటినుంచే స్త్రీ విముఖత అతనిలో తీవ్రంగా పనిచేస్తూ వుంది. జీవితపు దృక్పథమే వేరైనప్పుడు ఈ చిన్న విషయాలు అతన్ని ఎన్నడూ బాధించి వుండలేవు.

కాని ఇప్పటి సమస్యే వేరుగా కనిపిస్తోంది. పాతికేళ్ళపాటు తనను బాధించని యవ్వనం తిరగబడుతూ వుంది. దాన్ని సర్వశక్తులూ ఉపయోగించి గొంతు పిసికివేస్తూనే

వున్నాడు... కాని ప్రతీ రోజూ తనకిది అగ్నిపరీక్షగా వెంటాడి తన మొహంలో నవ్వుతూన్నట్లే వుంది.

యీ ప్రదేశాన్ని మార్చటం కుదరనిపని. పోనీ మరొక రకంగా మనస్సును తిప్పుకునేందుకు ఇక్కడనుంచి కదిలేందుకే వీలులేని పరిస్థితాయె. పద్మను ఇక తన దగ్గరకు రావొద్దని నిష్కర్షగా చెప్పటం మంచిదని తోచింది. కాని తెల్లవారేటప్పటికి ఆమె కనిపించకపోతే ప్రపంచంలో విలువైన వస్తు వేదో పోగొట్టు కున్నట్లనిపించేది.... దాంతో ఆమెకు మరి రావొద్దని చెప్పగలిగే సాహసం కరిగిపోయేది. ఆమెతో కఠినంగా మాట్లాడాలనుకునేవాడు; కాని అదీ సాధ్యమయేదికాదు.

ఏనాడో ఆమె తనను పాదాక్రాంతుణ్ని చేస్తుందేమోననే భయం రోజురోజుకూ అధికమౌతుంది. మరి ఇలాటి భయమే ఆమెకు ఎందుకు లేదు? తను ఆమెను నమ్మలేకుండా వున్నాడు. ఆమె ఎందుకు నమ్మాలి? తనపట్ల ప్రదర్శించే గౌరవంవేరు. తనవల్ల కలిగే హానినుంచి తననుతను కాపాడుకునేందుకు ప్రయత్నించటం వేరూను. అందులోనూ ప్రమాదం జరిగినట్లయితే అది వుభయులకూ పతన కారణమే అవుతుందాయె!

ఈ రకంగా దిగజారిపోవటం, నీచశక్తులకు క్రమంగా అవకాశాల్ని ఇవ్వటంతో సీను తనను తాను దూషించుకునేవాడు. యవ్వనపు కోర్కెల్ని ఏవగించుకోవటం, వాటికి ఎదురీదటం వేరు, వాటిని పూర్తిగా విసర్జించగలగటం వేరూను. వొదలని వాటిని భరించటమన్నా జరగాలి. లేక వాటి నుంచి విముక్తినన్నా పొందాలి.

తాను కేవలం మానవుడనే మాట జ్ఞాపకం వచ్చి, సామాన్య మానవుని వలెనే వుండిపోతే ఇంత సంఘర్షణ వుండదు కదా అనిపించేది. కాని తాను రాజకీయ నాయకుడు; తనకు బాధ్యతలున్నవి. సమాజంలో జరిగే అన్యాయాలకు, అక్రమాలకు ప్రాణమొడ్డి అమాయక ప్రజల పక్షాన పోరాడే శక్తిని సంపాదించిన తను వీటన్నిటికీ అతీతుడుగానే వుండి తీరాలి. కాని ఆ నిశ్చయాలు వేరు. వాటిని నిత్యజీవితంలో అమలు జరపటం వేరుగా తోచింది.

బతుకు ముళ్ళబాటవలె తయారయింది. ఏ విధి కరుణ వల్లనైనా తనకు మరో ప్రదేశం దొరుకుతే బాగుండును. కాని ఇప్పట్లో ఆ చిహ్నాలే కనిపించటం లేదు. పోనీ తనే వెళ్ళి ప్రభుత్వానికి లొంగిపోయి జైల్లోవుంటే ఈ పతనం నుంచి తప్పించుకోవచ్చు; అప్పుడు ప్రభుత్వం తనను నమ్ముతుందనేమిటి? మిగతావాళ్ళ సంగతి తేల్చమని బాధించవచ్చు. ముందు రంగయ్య నాశనమౌతాడు. రాజకీయ నాయకుడిగా తను పతనమౌతాడు. తన ఆశయాలకూ ఆదర్శాలకు నీళ్ళ ధార వదిలి, కేవలం ఒక బానిసగా తయారౌతాడు.

అటు రాజకీయ జీవితంలోనూ, ఇటు నిత్యజీవితంలోనూ పతనం తప్పదు. ఎలా చూచినా రాజకీయంగా తను చలించటం, ఒక్క ఆడదానికి భయపడి తన

పార్టీనంతనూ మంటగలపటం హాస్యాస్పదమే అవుతుంది. అందుకని ఇక్కడేవుండి ఈ నీచకోర్కెకు బలికాకుండా కాపాడుకోవటం కన్నా మరి మార్గం లేదని తేల్చుకునేందుకు సీను ఎక్కువ కాలయాపన చేయలేదు.

## 4

“మీకు వొంట్లో బాగుండటంలేదా?” అని అడిగింది పద్మ.

సీను తత్తరపడ్డాడు. తనలో ఇతర్లు గమనించేటంత మార్పు వచ్చిందన్నమాట!

“బాగానే వుంది” అని చప్పరించాడు, బలవంతంగా చిరునవ్వు నవ్వుతూ.

“ఐతే మనస్సు బాగాలేదేమో?....ఏమైనా నాయకుల్లో భేదాభిప్రాయాలొచ్చినవా?”

పద్మ ఇంత తెలివిగలదని తనెప్పుడూ అనుకోలేదు. అనేకసార్లు నాయకులు ఘర్షణపడటం, ఒకరిపట్ల వేరొకరు ద్వేషాల్ని పెంచుకోవటం జరిగింది కాని, అప్పుడు కూడా తను ఇంతగా కలత చెందలేదు. యీ సమస్య తలక్రిందులు చేస్తూనే వుంది.

అడిగింది కనక ఉన్నది ఉన్నట్లుగా ఆమెకు చెప్పేద్దామనుకున్నాడు. ఇన్నాళ్ళూ చెప్పేందుకు భయపడి, ఎలా చెప్పాలో తెలియక వూరుకున్నాడు; అందుకనే పద్మను గూర్చిన కలలతో సతమతమవుతున్నాడు. కాని ఏనాటికైనా ఇది తేల్చుకోకుంటే తనకు మనశ్శాంతి వుండదు. తనలో తాను కుమిలి, కృంగి కృశించిపోవాల్సి వుంటుంది. ఇంతకన్న మంచి సమయం వస్తుందనుకోవటం పొరపాటు!

సీనులోని పశువు తిరగబడింది; దాన్ని నిరోధించ గల శక్తి అతనిలో మాయమైంది... ఐనప్పటికీ తనది పశువాంఛ కాదు - తను ప్రేమలో పడ్డాడు. ఆమెను వివాహమాడేందుకు సిద్ధంగా వున్నాడు. అది ఆదర్శమే అవుతుంది... ఇలాటి వూహలతో సీను తన వాంఛకు ఒక అత్యుత్తమ స్థానాన్ని ఇవ్వగలిగాడు.

ఆలోచనలతో కొట్టుకుపోతూ సీను ఏమీ మాట్లాడలేకపోయాడు.

“ఏమండీ! ఏమైంది? నాకు చెప్పరూ?” అందామె, సీను ఫాలభాగం మీద మృదువుగా తాకుతూ.

ఆ స్పర్శ అతనికి కొత్త ప్రోత్సాహాన్నిచ్చింది. అతనికి వేరొక ప్రపంచమే కనిపించటం లేదు. కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. మృగతుల్యుడయ్యాడంటే ఆశ్చర్యం లేదు. చప్పున ఆమెను బలంగా తనవైపు లాక్కున్నాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

ఇలా జరుగుతుందని పద్మ అనుమానించి వుంటే చాలా జాగ్రత్తపడేది. తీరా ప్రమాదలో ఇరుక్కున్నాక గాని, ఆమె ఆలోచనలు పనిచేయటంలేదు. బలంకొద్దీ విదలించుకొని, బైట పడింది. ఆమె ముఖం ప్రశాంతతను కోల్పోయింది. ఐతే ఆమె కోపంతో వణకటం లేదు. ఆ మాత్రం నిగ్రహాన్ని చూపగల శక్తి ఆమెకు లేకపోలేదు.

"తప్పుకాదూ" అంది మృదువుగా, కాని ఆ మాట కఠినంగా అనకపోవటం వల్ల సీనుకు తగిలీ తగలకుండానే వుండిపోయింది.

ఇది తప్పని తనకు తెలియదూ? కాని యీ తప్పును గూర్చి చర్చించేందుకు ఇది సమయమే కాదు. అందులోనూ పద్మ – తన స్వప్న సుందరి, మెత్తగా మాట్లాడుతోందంటే, ఆమెతో ఘర్షణ పడటం అనవసరం. అతని శరీరం తప్ప, మనస్సు పనిచేయటం లేదు.

"ఫర్వాలేదు... నేను పెళ్ళాడతాను!" అన్నాడు అర్థం లేకుండా .

ఆమెను మళ్లీ దగ్గరకు లాక్కున్నాడు. యీసారి ఆమె బలంగా ప్రతిఘటించటం లేదు. కాని కొద్ది పెనుగులాటతోనే "ఉండండి...ఆలోచించుకోనీండి.... అబ్బ...." ఇంకా ఏమేమో మాట్లాడాలని ప్రయత్నించింది. కాని సీను ఆమె నోటిని తన నోటితో మూసివేశాడు. సంస్కారాన్ని పొందిన వారిద్దరిలోని పశు శక్తులూ వారిని ఓడించి, తృప్తి పొందినవి.

## 5

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది;

నిర్లిప్తంగానే ఉన్నట్లు తోచింది సీనుకు. ఆమెను వెళ్ళనీకుండా ఆమెను వూరడిస్తూ మాట్లాడుదామనుకున్నాడు; కాని ఆమె వెళ్ళిపోవటమే ఒక విధంగా మంచిదనిపించింది.

లోని పశువులో చలనం లేదు; మానవుడు విజృంభించాడు... తను ఎంత పొరబడ్డాడు! అయ్యో – తన చదువు, సంస్కారం, లోకానుభవం, దేశసేవ మొదలైన అనేక సద్గుణాలను యీనాడు ఒక నీచ వాంఛ కోసం మట్టిపాలు చేశాడు. తను యింత తేలిగ్గా పతనమైపోతానని కలలో కూడా వూహించలేదు. దీనికి ఏమైనా ప్రాయశ్చిత్తమంటూ వుంటే, తను తప్పక స్వీకరిస్తాడు.

సీను హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలైంది. ఆ లావా వేడికి అతను అట్టుడికినట్లు ఉడికిపోసాగాడు ... కుమిలి కుమిలి ఏడ్చాడు. తల గోడ కేసుకొని కొట్టుకున్నాడు. తలంతా బొప్పెలు కట్టింది. మనసులోని బాధ, శరీరకమైన బాధను కనిపించకుండా చేసింది..... తను చేసిన తప్పులకు ఆ నరకమే ఇక్కడ వుంటే నవ్వుతూ ఆ శిక్షను అనుభవించి, తనను తాను సంస్కరించుకొని మళ్లీ మనిషిగా రూపొందేవాడు.

కనీసం రెండు గంటలన్నా గడచి వుంటుంది. మనసులోని అశాంతి కాస్త తగ్గింది. రెండోవైపు ఆలోచనలు చెలరేగినవి... యీ సంగతి రంగయ్యకు తెలిస్తే? తిన్నయింటి వాసాలే లెక్కించిన తనను ఇంకా ఉండనిస్తాడా? కాని తనను బైటపెట్టటమంటే తనూ బైటపడటమే అవుతుంది. కనుక, ఆ భయం అనవసరం. ఐనా పద్మ ఇదంతా చెపితే కదా పరిణామం సంగతి?

తను - ఉక్కు హృదయంగల తను, ఇంత తేలిగ్గా యీ కూపంలోకి పడిపోవటం నిజంగా ఆశ్చర్యకరమే! కాని సూక్ష్మంగా ఆలోచిస్తే తనకు బదులుగా యీ స్థానంలో వేరెవ్వరైనా సరే ఇలాగే ప్రవర్తించి ఉండేవాళ్ళు. ఎందుకంటే పొందే సంస్కారం వేరు - జీవశాస్త్రపు శాసనాలూ, అవసరాలూ, ప్రకృతి శక్తుల ప్రభావానికి తట్టుకోగలగటం వేరూను. తాను ఎంతచెడ్డా మానవుడు - కేవలం మానవుడు - పశువులోనుంచి పరిణామాన్ని పొందిన వ్యక్తి! ఆ పశుత్వాన్ని కొంతవరకూ ప్రతిఘటించగల శక్తి ఉన్నవాడే కాని, పశుత్వాన్ని పూర్తిగా అణగదొక్కగల శక్తి ఉన్న వాడనుకోవటం పొరపాటేనేమో?

తానేమిటి - మహా తపశ్శాలి విశ్వామిత్రుడు, స్త్రీ అంటే ఏమిటో తెలియని అమాయకుడు ఋష్యశృంగుడు లాటి వాళ్ళే జారారు. తెలిసో, తెలియకో పొరపాటు జరిగిపోయింది. దాన్ని గూర్చి తర్కించుకోవటం కన్నా, తిరిగి అలాటి పొరపాటు జరగకుండా చూసుకోవటం మాత్రమే తన చేతుల్లో వుంది.

సీనుకు కొత్త విచారం పట్టుకుంది. యీ జరిగింది పార్టీకి తెలిసినా కింద ఎవ్వరూ ఉమ్మెయ్యరు. ఆ శిక్షకు తను తగును. కాని ఇన్నాళ్ళుగా నమ్మి సేవించిన దేశం, తానింకా ఎంతో సేవ చేయవలసిన దేశం తనను కాలతన్నుతుంది. దేశసేవకోసం దేన్నయినా సరే బలిపెట్టేందుకు తను ఎప్పుడూ సిద్ధమే; కాని దేశసేవను దేనికోసమైనా బలిపెట్టటం తనకు మించిన పని!.... యీ ఒక్క తప్పూ కాపాడబడితే, ఆ విధికి జీవితమంతా కృతజ్ఞుడవుతాడు.

హఠాత్తుగా పద్మ వచ్చింది. భయపడుతూనే ఆమె ముఖంలోకి చూశాడు. కాని ఆ ముఖంలో ఏ భావమూ స్పష్టంగా కనిపించటంలేదు. గరళాన్ని దిగమింగిన ఈశ్వరునివలెనే వుందామె... ఆమె కాఫీ తీసుకొచ్చింది. మాట్లాడకుండా కాఫీకిందపెట్టి, మెల్లిగా సీనును చూసింది. రెండు గంటలుగా అతను పడిన బాధకు సాక్ష్యాలిస్తూ తడి ఆరని కన్నీరు, తలమీద బొప్పెలు మొదలైనవి ఆమె దృష్టినుంచి దూసుకుపోలేదు.

స్త్రీత్వంలోని మాతృత్వమే ఆమెలో పనిచేయసాగింది. పమిట కొంగుతో అతని ముఖాన్ని తుడిచింది. మెత్తని వేళ్ళతో తలమీద బొప్పెల్ని నిమిరింది; ఇంతకుపూర్వం కనిపించని బాధ అతనికి ఇప్పుడు కనిపిస్తోంది.

"ఏమిటిదంతా? ఎందుకు ఇలాటి పని చేశారు? ఛీ....తప్పుకదూ?... పోనీండి దాని గూర్చి ఆలోచించి బాధపడకండి... ముందు కాఫీ తాగండి."

యీ సానుభూతి వాక్యాల్ని అతని చెవులు ఎన్నడూ విని ఉండలేదు. తప్పు చేసిన చిట్టిపాపను మందలించి, బతిమాలి, భంగపడే తల్లివలెనే ఆమె ప్రవర్తిస్తోంది. ఇలాటి స్త్రీ నుంచి దూరం కావటానికి తన హృదయం ఎంత కఠినమనుకున్నా, నిప్పులోపడిన మైనం వలెనే అవుతోంది.

కాఫీ తాగాడు; ఇంతవరకూ పడిన పశ్చాత్తాపమంతా వృథా అనిపించింది. తను అనవసరంగా మధనపడ్డాడు. ఆమె ఓదార్పు అతన్ని పెడమార్గాన తోసేందుకే సహాయపడింది. ఒకే తప్పుచేసిన ఇద్దరు వ్యక్తుల దృక్పథం వేరువేరుగా ఉన్నప్పుడు ఒకళ్ళను చూచి వేరొకరు మారటం, అదీ ఆత్మ తృప్తికిగాను ఉపకరించటం, దాంతోనే ఊరట చెందటం మనస్తత్వానికి కొత్త విషయం కానే కాదు.

తనలాగు ఆమె బాధపడలేదు, కనుక ఆమె వలెనే తనుకూడా దీన్ని స్వల్ప విషయంగా పరిగణిస్తే సరిపోతుందనుకున్నాడు. తనను యీ బాధ నుంచి విముక్తి చేసినందుకు ఆమెను మెచ్చుకున్నాడు.

ఆ రాత్రి ఆమె అతని గదిలోకి వచ్చింది. అప్పటికి అతను నిద్రిస్తూ ఉండి వుంటాడనుకోవటంలో ఆమె పొరపడింది... నిజానికి అతని పట్ల సానుభూతి చూపేందుకు, అతను గాయపడకుండా ఊరడించేందుకు ఆమె వచ్చింది. క్షణ క్షణానికీ తనలోని పశువాంఛల్ని పురికొల్పేందుకు ఆమె వచ్చిందనే అభిప్రాయం సీనులో పాతుకొనిపోయింది... ఆమె కాదు - ఎవరెంత చెప్పినా వినే స్థితిలో అతను లేడు. యీసారి నిర్భయంగా ఆమెతో ప్రవర్తించసాగాడు. యీసారే కాదు - ఇలాటి అనేక రాత్రులు తనకి స్వర్గ సౌఖ్యం రాసిపెట్టే వున్నదని అతను నమ్మాడు. అతని నమ్మకం కార్యరూపం ధరించింది కూడాను.

మరో ఆరునెలలు గడిచేటప్పటికి దేశంలోని పరిస్థితులు చాలా మారిపోయినవి. పార్టీ మీద నిషేధాజ్ఞ తొలగించబడింది.

యీ రోజు సీను వెళ్ళిపోతున్నాడు. ఐతే ఎవ్వరికీ తెలియకుండా.

## 6

రాత్రిపూట వెళ్ళటమే మంచిది. అలా కాకుంటే రంగయ్య యిరుకున పడతాడు.

రాత్రి ఒంటి గంటకు రంగయ్య యింటిలోనుంచి బైటపడ్డాడు. కాస్తదూరం వెంటవెళ్ళటం కూడా మంచిది కాదని, నిద్రకళ్ళతోనే రంగయ్య తలుపులు వేసుకున్నాడు. ఇవాళ పద్మ అసలు కనిపించనేలేదు. తను వెళ్ళిపోతున్నట్లు ఆమెకు తెలుసు కూడాను.

ఐతే పద్మ సంగతే అతని మనస్సును ఆక్రమించలేకపోయింది. రాజకీయ నాయకుల సమావేశం; ఆ ప్రణాళికలమీద చర్చ, ద్విగుణీకృతమైన శక్తి సామర్థ్యాలతో తను ముందుకు దూకి దేశాన్ని వుగ్రూతలూగించి సమాజ వ్యవస్థనే మార్చగలగటం - యీ ముందున్న భాగవతమంతా అతని కళ్ళముందుండి కొత్త వుత్సాహాన్నిస్తోంది.

బైట పిండారబోసినట్లు వెన్నెల. ఇలాటి ప్రకృతిని చూసి ఎన్నాళ్ళయిందో! రంగయ్య యిల్లు దాటాక ఒక ఫర్లాంగు దూరంలో చిన్న గుట్టవుంది. ఆ గుట్టపక్కనే ఎన్నో

అడవి చెట్లు పెరిగివున్నవి. ఒక పెద్ద కొలను కూడా వుంది. పశువులు మాత్రం నీళ్ళు తాగేందుకు యీ కొలను వుపయోగపడుతూ వుంటుంది. వానాకాలమేమో కొలను నిండుగా వుంది.

సీను చకచకా నడుస్తున్నాడు. భావి జీవితమంతా ఎంతో హృద్యంగమంగా కనిపిస్తోందతనికి. యీ ప్రకృతి కూడా అతని మనస్సును ఆకర్షించే స్థితిలో లేదు.

"ఏమండీ"!

అదిరిపడ్డాడు... యీ అర్ధరాత్రి ఎవరూ? కొలను పక్కనే వున్న చెట్ల చాటునుంచి పద్మ వచ్చింది.

"పద్మా! నేను వెళ్తున్నాను" అన్నాడు తొందరగా.

పద్మ మొహమంతా జేవురించి వుంది. కన్నీరు మున్నీరుగా ఏడ్చి వున్న గుర్తులున్నవి. ఐతే సీను వీటిని గమనించే స్థితిలో లేడు.

"నన్నూ మీతో తీసుకొని వెళ్లండి" అందామె తడి ఆరిన గొంతుతో.

సీను నవ్వాడు - ఆమె పిచ్చితనానికి!

"నాతోనా? ఎక్కడికి?"

"ఎక్కడికైనా సరే - మీతోనే వుంటాను."

"నీకు మతిపోతోంది. నేను నా జీవితాన్ని రాజకీయాలకూ, దేశోద్ధరణకూ అర్పించివేశాను."

"నేను కూడా మీతోనే వుండి..."

ఆమెను మాట్లాడనివ్వలేదు. అన్నాడు: "ఎట్లా? నేను ఇతర బాధ్యతల్ని వహించలేను. నీకు తెలుసుగా - నా జీవితం ముళ్లబాట. అందులోకి నీలాంటి 2వాళ్ళు రాదగదు."

యీరకంగా సీను మాట్లాడుతాడని ఆమె ఎన్నడూ వూహించలేదు. తనంటే ఎంతో ప్రేమనూ, పవిత్ర ప్రణయాన్నీ సూచించేవాడు - యీనాడు కనీసం సానుభూతిగానన్నా మాట్లాడకపోవడంతో ఆమె నీరైపోయింది.

"ఇంటికి వెళ్ళు" అన్నాడు సీను.

"ఇంటికా! ఏ మొహం పెట్టుకొని వెళ్ళేది? మాదెంతో పరువు, మర్యాదలున్న వంశం. నా కిప్పుడు మూడోనెల!" అందా అబల సిగ్గువిడిచి.

జవాబుకోసం సీను వెతుక్కోవాల్సి వచ్చింది. చివరకు ఎలాగో అన్నాడు: "నా పరిస్థితులు వేరు. ఒక స్త్రీ కోసమై నేను దేశాన్ని త్యాగం చెయ్యాలి. అది కుదరదు!"

"ఆ రోజు నన్ను పెళ్ళాడతానన్నారు?" అందామె.

"ఏమో అన్నానేమో? ఆ ఉద్రేకంలో నాలోని మృగం ఏం వాగిందో? కాని నీవే ఆలోచించు. ఒక ప్రక్క దేశం – మరో ప్రక్క ఒక స్త్రీ – విజ్ఞుడు ఏది ఎన్నుకోవాలి?"

"అంతేనా?" అందామె, కుళ్ళికుళ్ళి ఏడుస్తూ.

"నీవిలా ఏడుస్తే అయేదేముంది? ఏదో తప్పే చేశాం... కాని నేనొక్కణ్ణే నేరస్తుణ్ణి కాదు.. బాధ్యతంతా నాదేనన్నట్లు మాట్లాడకు... ఆ రాత్రి మళ్ళీ నీవు రాకుండా ఉన్నట్లయితే యీ ప్రమాదం సంభవించేది కాదు.... పోనీ అన్నింటినీ వదిలెయ్... చూడు: నాకు ఎక్కువ వ్యవధి లేదు. నేనింకా పన్నెండు మైళ్ళు నడవాలి. ఇక్కడ ఎవరైనా చూస్తే చాలా ప్రమాదం...."

ఆమె మాట్లాడేందుకు ఏం మిగిలింది? తన స్వామే తనను త్యజించాడు. ఆమె నిర్జీవ ప్రతిమవలె అలాగే ఉండిపోయింది.

"మరి నేను వస్తాను–"

ఆమె దగ్గర సెలవు తీసుకోలేదు. కాని తొందరపడే కాళ్ళను సాగించాడు.. అతను వెళ్ళిపోతూంటే ఆమెలో మిగిలిన కొద్దిశక్తి ఆమెను వెక్కివెక్కి ఏడిపించసాగింది.

ప్రశాంత వాతావరణంలో కలకలం బయలుదేరేటప్పటికి రెండు చేపలు కొలనులోని నీటిపైకివచ్చి చూడసాగినవి. ఇప్పటికే సీను గుట్టదాటి దారిని పడ్డాడు. యీ భూప్రపంచంలోనే తనకు మరి తావులేదనే సత్యాన్ని పద్మ గ్రహించకపోలేదు.

కొలనులో పెద్ద చప్పుడైంది. ఘోరమైన యీ ప్రపంచాన్ని చూడలేని చేపలు రెండూ తమ నివాసాలను వెతుక్కుంటూ మునిగినవి.

యీ చప్పుడు సీనుకు వినిపించకపోలేదు. కాని అతని దేశోద్ధారణా తత్పరతకు యీ శబ్దమే కాదు – ఆటంబాంబు శబ్దమైనా భంగం వాటిల్ల చేయలేదు. అతన్ని ఆపగల శక్తులేవీ యీ ప్రపంచంలో లేవు. అందుకని అతను చకచకా ముందుకే సాగిపోతున్నాడు. మరి దేశోద్ధారకుడాయె!

*రచన – మే, 1954*

పురుషుల్ని పాపాలకు పురికొల్పటం కోసమే స్త్రీలు జన్మించారనే మూఢ నమ్మకంతో రాజకీయ తపస్సు సాగించి, అందులో తన దేశోద్ధారణ మహా యజ్ఞానికి అమాయకురాలిని యజ్ఞ పశువుగా బలిగొన్న పుణ్యాత్ముడి జీవిత గాథ.